
ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



## ఎఎస్‌పిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా నూతన అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం, తన ఛాంబర్ లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

# జనవరి 26 నాటికి కుంకీ ఏనుగులు రాక

- రెండేళ్లలో డోలీరహిత గ్రామాలు కావాలి
- ప్రతి గ్రామానికీ ఆటో, అంబులెన్సు వెళ్లాలి
- డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు




డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

వచ్చే ఏడాది జనవరి 26 నాటికి కుంకీ ఏనుగులు జిల్లాకు రానున్నాయనిరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివద్ధి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. కుంకీ ఏనుగుల నివాసానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రైతులు అధిక లాభాలు, దిగుబడులు తెచ్చే పంటలతో పాటు వాణిజ్య పంటలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,100 ఎకరాల్లో ఉన్న ఆయిల్ పామ్ పెంపకాన్ని 3,300 ఎకరాల్లో పంటను పండించేలా రైతులను చైతన్య పర్చాలన్నారు. బిందు సేద్యం, ఇతర సేద్యాలకు ఉపయోగపడేలా సూక్ష్మ నీటిపారుదల యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రైతు సేవా కేంద్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ పరిధిలోని రైతులకు లాభసాటి పంటలు, భూసారానికి తగిన పంటలు, వాణిజ్య పంటల పట్ల అవగాహన కల్పించాలని, డిసెంబర్ 3న రైతుల ఆలోచనలు తెలుసుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో శతశాతం చేపల పెంపకం చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ భవనాల ఏర్పాటు, మరమ్మతులకు నాబార్డ్ నుంచి నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారులు వేసేలా నిర్ణయం తీసుకున్నామని, వాటిలో 100 పూర్తికాగా, మిగిలిన 170 రహదారులను ఏడాదిలోగా పూర్తిచేయాలని పంచాయతీ, గిరిజన సంక్షేమ శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రానున్న రెండేళ్లలో జిల్లాను డోలీరహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యమని ఇన్‌ఛార్జి మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి అత్యవసర పరిస్థితుల్లో ఆటో, అంబులెన్సు వంటి వాహనాలు చేరుకునేలా పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కింద రూ. 7వేలు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందని, ఇనాం భూముల కారణంగా జమ కాని రైతుల ఖాతాల్లో నిధులు మళ్లించేందుకు రూ.8కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో సరైన వసతులు లేనందున అనారోగ్యానికి గురికావాల్సి వచ్చిందని, ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని మంత్రి తెలిపారు. వర్షాలతో దెబ్బతిన్న పత్తి రైతులకు న్యాయం చేయడంతో పాటు చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అధికారులు చొరవతో కేవలం 8గంటల్లోగా నగదు జమ అవుతుందన్నారు. పత్తి రైతు కొనుగోలు కేంద్రం అదనంగా కావాలని, కోరగా, దీనిపై మాట్లాడతామని మంత్రి హామీ ఇచ్చారు.

జిల్లాలోని ఆసుపత్రి భవన నిర్మాణాలన్ని త్వరగా పూర్తిచేయాలని, డిసెంబర్ 31 నాటికి భద్రగిరి, మార్చి 31 నాటికి సీతంపేట మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మలేరియా కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో అంగన్వాడీ భవన కేంద్రాలను పూర్తిచేసేలా కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో ఈ సమీక్షలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎస్డిసీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషలిస్ట్ వైద్యులను బలవంతంగా తీసుకురాలేం : మంత్రి

మన్యం జిల్లా కేంద్రంతో పాటు పలాస, ఇచ్చాపురం వంటి మారుమూల ప్రాంతాలకు గుండె, ఇతర విభాగాల స్పెషలిస్ట్ వైద్యుల్ని బలవంతంగా తీసుకురాలేమని, ఎవరైనా వస్తామంటే నియమిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. శుక్రవారం జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యులు రావడానికి ఇష్టపడడం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు ప్రత్యేక జీతభత్యాలతో పాటు వసతి సౌకర్యాలు కల్పిస్తే వస్తారని చెప్పారు. దీనిపై ప్రభుత్వానికి రెండు సూచనలు చేసినట్లు తెలిపారు. స్పెషలిస్టు వైద్యులకు ప్రత్యేక జీత భత్యాలతో పాటు వసతి సౌకర్యాలు కల్పించడం లేదా ఆ ప్రాంతాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యుల కోసం ప్రత్యేక నియామకం చేపట్టాలని కోరినట్లు చెప్పారు. జిల్లాలో పండిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులు ఖాతాల్లో నగదు జమ చేసిందుకు 48 గంటలు సమయం నిర్ణయించినప్పటికీ, శాఖాధికారుల చొరవతో కేవలం 8 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతున్న సంగతిని మంత్రి గుర్తుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం రంగుమారినా, చిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు అధికారులకు జారీచేశామన్నారు. మొంథా తుఫాను, అంతకుముందు వచ్చిన తుఫానుల వల్ల నష్టపోయిన రైతుల వివరాలు సేకరించామని, వ్యవసాయ, ఉద్యానవన పంటలతో పాటు పశు నష్టాన్ని గుర్తించి వారికి ఇన్ ఫుట్ సబ్సిడీ కింద నష్టపరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో పత్తి దిగుబడి అధికంగా ఉందని, ఇప్పటికే భామిని, సాలూరు ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కొమరాడలో కూడా పత్తి కొనుగోలు కేంద్రం కావాలని రైతులు కోరుతున్నారని, దీనికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కురిసిన వర్షాలతో పత్తి తడిసి రంగు మారిందని, ప్రభుత్వ నిబంధనలను సడలించి ఆ పత్తిని కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వ కాటన్ సంస్థతో మాట్లాడి పత్తి రైతులకు న్యాయం చేయాలని చూస్తున్నట్లు మంత్రి వివరించారు. అన్నదాత సుఖీభవ కింద రూ.7వేలు రెండో విడత విధులు విడుదల చేసామని అన్నారు. చిత్తూరు జిల్లా మాదిరిగా ఈ జిల్లాలో పాడి ఉత్పత్తి, మాంసం ఉత్పత్తులు పెంచడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 270 మరుగుదొడ్లను మంజురు చేశామని, వాటిలో 170 పూర్తయ్యాయని, ఈ నెలాఖరులోగా మిగిలినవి పూర్తికానున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి ఏర్పాటుకై రూ.5 కోట్లు నిధులను మంజూరుచేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. మన్యం జిల్లాలో ప్రతి గ్రామానికి అంబులెన్స్ వెళ్లాలని, ఇందుకు అవసరమైన రహదారులను రెండళ్లలో పూర్తిచేసేలా గతంలో నిర్ణయించుకున్నామని చెప్పారు. జిల్లా కొంతమంది గృహాలు నిర్మించుకున్నప్పటికీ వాటికి పట్టాలు లేవని, వాటికొరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని, దీనికి అనుగుణంగా రెగ్యులేషన్ చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ ఉన్నారు.

## కమిషనర్‌గా కిశోర్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



స్థానిక మున్సిపల్ రెగ్యు లర్ కమిషనర్ గా కె.కిశోర్‌కుమార్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ చాంబర్లో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు కార్యాలయంలో ఉన్న రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగు, ప్రజారోగ్య, పరిపాలన విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈయన విశాఖ నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్వైజర్‌గా విధులు నిర్వహించారు. ఉద్యోగోన్నతుల్లో భాగంగా పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర సూచనలను, సలహాలను పాటిస్తూ, కార్యాలయం లో ఉన్న అన్ని విభాగాల అధికారుల సహాయ, సహకారంతో పట్టణాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని సోమగండికి చెందిన పసుపురెడ్డి నరసయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన వీరఘట్టం మండలం తలవరం హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నరసయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి .




సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్

# మీ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించండి

**ప్రతి కార్యాలయంలో 15 శాతం రిజర్వేషన్ అమలు కావాల్సిందే**

**రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్**

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాస్థాయిలో వచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను, సమస్యలను మీ స్థాయిలోనే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై చైర్మన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అట్రాసిటీ కేసులు లేకపోవడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని, పోలీస్ అధికారులను అభినందించారు. జిల్లా అధికారులు ప్రతీ కార్యాలయంలో తప్పనిసరిగా 15 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని, వాటికి సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలని అన్నారు. అలాగే వసతి గృహల్లో పర్యవేక్షణ తప్పనిసరి అని, తద్వారా వసతి గృహాల్లో అందిస్తున్న విద్యా ప్రమాణాలు, ఆహర నాణ్యత, పారిశుధ్యం తదితర వివరాలు తెలియజేస్తామన్నారు. విద్యార్థులతో ముచ్చటించడం వల్ల అక్కడ సమస్యలు తెలుస్తాయని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అధికారి వారంలో కనీసం రెండుసార్లు సందర్శనలు చేయాలని, దీనివల్ల విద్యార్థుల్లో నమ్మకం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ 65శాతం మంది ప్రజలు నేరుగా ఎంపీ, ఎంపీటీసీ, సర్పంచ్, జిల్లా స్థాయి నేతల వద్దకు వచ్చి పిటీషన్లు ఇస్తున్నారని గుర్తుచేశారు. అధికారులు ప్రతి పిటీషనర్‌ను ఎదురుగా కూర్చోబెట్టుకొని మాట్లాడితే దాదాపుగా 50శాతం సమస్య అక్కడే పరిష్కారమవుతోందని అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎస్‌సి కమిషన్ కార్యదర్శి చిన రాములు మాట్లాడుతూ జిల్లాలో తలెత్తేన సమస్యలను జిల్లాస్థాయిలోనే పరిష్కారం కావాలని పేర్కొన్నారు. తమ స్థాయి వరకు రాకుండా చూడాలని, తమ స్థాయిలో కూడా పరిష్కారం కానందున జాతీయస్థాయికి ఫిర్యాదీదారులు వెళ్తారని గుర్తుచేశారు. అటువంటి వాటికి తావులేకుండా వచ్చిన అర్జీదారుల పట్ల మర్యాదగా నడుచుకుంటూ, వారి సమస్యను సావధానంగా విని పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ చేసిన సమీక్ష అధికారులకు ఒక వర్క్‌షాప్‌లాగా ఉపయోగపడిందన్నారు. జిల్లాలో రిజర్వేషన్ పక్కాగా అమలవుతుందని, ప్రతి శాఖలో పనిచేస్తున్న సిబ్బంది, బ్యాక్ లాగ్ పోస్టుల వివరాలను వారంలోగా అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎస్డిసీలు పి.ధర్మచంద్రా రెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి హాకీ పాఠశాల క్రీడలకు మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. హాకీ రాష్ట్ర స్థాయి అండర్ -14 బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీలకు ఆరిక సుధీర్ కుమార్, ఆరిక నవీన్ కుమార్, ఆరిక అశ్వంత్, బిడ్డిక మహేష్ ఎంపికైనట్లు పిడి అప్పారావు తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు తిరుపతి చంద్రగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగే హాకీ పోటీల్లో ఆడనున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ అప్పారావు, స్కూల్ కమిటీ చైర్మన్ సిబ్బంది అభినందించారు.



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 35 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రతి శుక్రవారం సీతంపేట ఐటిడిఎలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 35 మంది గిరిజనులు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఐటిడిఎ ఎపిఒ ఎస్‌వి గణేష్, డిడి అన్నదొర అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎపిఒ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, డిపిఎం రమణ, డిఇ నాగభూషన్, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, భామిని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సందీప్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షన్‌దారులు

## ఇపిఎఫ్ పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి -సీతానగరం

ఇపిఎఫ్ పెన్షన్‌దారులకు కలిసి పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ వద్ద పెన్షన్‌దారులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుగర్, జ్యూట్ కార్మికుల శ్రమతో దాసుకున్న పిఎఫ్ సొమ్మును చెల్లించకుండా పెన్షన్ రాకుండా చేస్తున్న ప్రభుత్వాలు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జ్యూట్, షుగర్ ఫ్యాక్టరీల్లో 40ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, పెన్షన్ కష్టార్జితం దాసుకుంటే వచ్చే పెన్షన్ రూ.500 నుంచి రూ.2వేలు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం 20 కోట్ల మంది శ్రమజీవులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. సుగర్ ఫ్యాక్టరీలో సుమారు 200 మంది కార్మికులు దాసుకున్న పిఎఫ్ నేటికీ రాలేదని, పెన్షన్‌కు అర్హులు కాలేదని, వీరి సొమ్ము యజమానులు వద్దే ఉందని అన్నారు. కార్మికుల చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి వారికి ద్రోహం చేస్తుందన్నారు. తక్షణమే ఈ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెన్షన్ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ జైప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, భవన నిర్మాణకార్మిక సంఘం నాయకులు ఆర్.రాము, శ్రీరామ సుగర్స్ యూనియన్ నాయకులు బర్నాల అప్పారావు, కార్మికులు సింహాచలం, కె.బుచ్చినాయుడు, ఎ.రామచంద్రరావు, వి.చిన్నంనాయుడు, గౌరమ్మ ఎరుకులమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## రావుపల్లిలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ బొంతాడ మహే శ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు విక్రయించి మద్దతు ధరను పొందా లని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బోను సత్యనారాయణ మాస్టారు, బొంతాడ శంకర్రావు, దాసరి బలరాంనాయుడు, బోను జగన్నాథంనాయుడు, గుంట్రెడ్డి సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలి

**డిఆర్‌సి సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్**

ప్రజాశక్తి - పార్వతీపురం

తోటపల్లి బ్యారేజికి సంబంధించిన నాగావళి కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు పునఃప్రారంభించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. దీనిపై తీర్మానం చేయాలని కోరారు. ఈ పనులు పూర్తయితే జియ్యమ్మ వలస, పాలకొండ, వీరఘట్టం మండలాలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్నప్పుడు పాలకొండ నగర పంచాయతీకి డంపింగ్ యార్డ్ కోసం ఐదెకరాల భూసేకరణ చేసినట్లు చెప్పారు. నగరపంచాయతీకి డంపింగ్ యార్డ్ లేకపోవడంతో సమస్యగా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్సీ విక్రాంత్ కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సిఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్‌లో ఉంటున్నాయని, జిల్లా మినరల్ ఫండ్ నిధులు కూడా గత ప్రభుత్వం హయాంలో సిఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం చేసినట్లు మంత్రి చెప్పారు. దీనిపై జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎఫ్ఎంఎస్ విధానం తీసుకొచ్చింది 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలోనని చెప్పారు. దీన్ని రాజకీయం చేయొద్దని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.

## 23న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి -వీరఘట్టం

పార్వతీపురంలో గల వేదాంత జూనియర్ కళాశాలలో ఈనెల 23న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌరినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4న మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో విజేతలైన 17 ప్రభుత్వ పాఠశాలలు, 7 ప్రైవేట్ పాఠశాలల నుంచి 72 మంది విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా సైన్స్ సంబరాల్లో మ్యాజిక్ షో, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మండల స్థాయి జిల్లా స్థాయి విజేతలకు బహుమతుల ప్రధాన ఉంటుందని వారు తెలిపారు. జిల్లాస్థాయి సంబరాలు గెలుపొందిన వారికి డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో కాకినాడ జెఎన్‌టియులో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని వారు తెలిపారు.

## ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు బిసి వార్డులకా?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు బిసి వార్డులకు కేటాయించడం పట్ల 12వ వార్డ్ కౌన్సిలర్ కోడెం విజయ్‌కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14, 19 వార్డులు ఎస్సీ, ఎస్‌టి రిజర్వ్ వార్డులు కాగా, అక్కడ నిధులు కేటాయించకుండా మిగిలిన వార్డుల్లో కేటాయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిధులు ఎస్సీలులేని ప్రాంతాల్లో కేటాయించడం అన్యాయమన్నారు. అవి కూడా కొన్ని వార్డుల పరిమితం చేశారన్నారు. ఏ ప్రాతిపదిక నిధులు ఆవార్డులకు కేటాయించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారుజ దీనిపై మున్సిపల్ శాఖ ఆర్‌డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

# భూ సమస్య పరిష్కరించండి

**ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను కోరిన శివ్వాం దళితులు**

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని శివ్వాం గ్రామ దళితుల భూ సమస్య పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ .కెఎస్ జవహర్‌కు కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యాన గ్రామ దళితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ జవహర్‌కు సమస్యను కెవిపిఎస్ నాయకులు యమ్మల మన్మధరావు, నారాయణస్వామి, దళితులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 1970లో శివ్వాం లోని 14మంది దళితులకు 22.80ఎకరాల భూమికి డిపట్టాలు ఇచ్చిందని చెప్పారు. దీనిపై భూస్వాములు ఆ భూమి కాదని కోర్టుకు వెళ్లారని చెప్పారు. కోర్టు ఇంజెక్షన్ ఇచ్చిందన్నారు. భూమి హక్కుదారులెవరో తేల్చమని సర్వే సెటిల్మెంట్ అండ్ భూ రికార్డుల అధికారికి ఆర్డర్ వేశారని తెలిపారు. ఆ భూమి ప్రభుత్వానిదే, దానిపై కేసు వేసిన రైతులకు హక్కు లేదని సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల అధికారులు తేల్చారని చెప్పారు. దీనిపై రైతులు హైకోర్టులో అపీల్ దాఖలు చేశారని చెప్పారు. ఈ భూమిపై వివాదాన్ని నాలుగు నెలల్లో తేల్చమని సర్వే అండ్ భూ రికార్డుల కమీషనర్‌ను ఆదేశిస్తూ హైకోర్టు 2014లో ఆదేశించిందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూములు 14 మంది దళితులు పేరున ఎస్ఎఫ్ఎ రికార్డులోను, వెబ్ ల్యాండ్ లోను నమోదై ఉన్నాయని చెప్పారు. ఈ భూమికి సంబందించి 1బి, అడంగల్ (పహాని) వస్తున్నాయని, హైకోర్టు ఆర్డర్ ఇచ్చి 11 ఏళ్ల పూర్తయినా నేటికీ పరిష్కారం చేయలేదని చెప్పారు. కానీ ఆ భూమిలను అధికారులు సాగు చేయనివ్వడం లేదని చెప్పారు. వ్యవసాయ చేసేందుకు అనుమతులు ఇప్పించాల్సిందిగా కోరారు. దీనికి కమిషనర్ చైర్మన్ స్పందిస్తూ 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్లి వెంకటరమణ, పకీరమ్మ, రమణ, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ చైర్మన్‌కు వినతిని అందజేస్తున్న కెవిపిఎస్ నాయకులు, దళితులు

### జోగింపేట బాలుర గురుకుల పాఠశాల తనిఖీ

సీతానగరం : మండలంలోని జోగింపేట బాలుర గురుకుల పాఠశాలను కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతాలను, డార్మెటరీ, మరుగుదొడ్లు పరిశీలించారు. అలాగే విద్యార్థులుంటున్న వసతి గదులను, తరగతి గదులను, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, ఎప్పటికప్పుడు వైద్య తనిఖీలు చేయించాలని సంబంధిత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు. ప్రిన్సిపల్ డి.రాజారావు, అధ్యాపకులు కె.ఈశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

## సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిహెచ్‌డబ్ల్యులు రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న 2361 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఎఎన్ఎంలుగా శిక్షణ పొంది ఆశా వర్కర్లుగా పనిచేస్తున్న కార్యకర్తలను ఎఎన్ఎంలుగా నియమించాలని, ఆశాల గౌరవ వేతనం డైరెక్టర్ నుండి అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతి, నారాయణమ్మ, భవాని, లక్ష్మి పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో గల వెంకటరాయుడి కోనేరు గట్టుపై సాహితీ సుధ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా పేదలకు శుక్రవారం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. 30 రోజుల పాటు భోగాది సీతయ్య, వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేపట్టారు. శుక్రవారం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. నెల రోజులుగా అన్నదానానికి సహకరించిన సీతయ్య, ప్రదీప్ కుటుంబ సభ్యులకు సొసైటీ నిర్వాహకులు ప్రసాద్ మాస్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నిత్య అన్నదాన కార్యక్రమానికి వాలంటీరుగా సహకరిస్తున్న బోనుమంతు బుజ్జి, కిల్లారి రామకష్ణ, ముంజేటి ఉమమహేశ్వరరావు, శిల్లా మల్లి, గోవింద్ , మహేష్ , సూరపునాయుడు, లోకేష్ , కన్ను తదితరులను మాస్టార్ అభినందించారు.

## డిఎల్‌డిఒ కార్యాలయానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ లెవెల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయానికి శుక్రవారం స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి డిఎల్‌డిఒ గోపాలకృష్ణతో కలిసి స్థల పరిశీలన చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం దగ్గర ఉన్న స్థలాన్ని గుర్తించారు. 10 సెంట్లు స్థలాన్ని గుర్తించి కార్యాలయం నిర్మాణానికి అనువుగా ఉంటుందన్నారు. నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులు పంపిస్తామన్నారు. వీరితో పాటు డిఎల్‌పిఒ ప్రసాదరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## భాస్కరరావు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని మరికి పంచాయతీ కొత్తఊరుకు చెందిన గిరిజన యువకుడు మండంగి భాస్కరరావు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐటిడిఎ పిజిఆర్‌ఎస్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండంగి భాస్కర్ రావు భార్య మండంగి జయంతి, పంచాయతీ సర్పంచ్ హిమరక గంగ, గ్రామానికి చెందిన గిరిజన యువకులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

## వ్యవసాయశాఖ మంత్రికి స్వాగతం

ప్రజాశక్తి - వీరఘట్టం

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సమీక్షా సమావేశానికి శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరవుతున్న సందర్భంలో వీరఘట్టంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సాధారణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ పి.విజయరమణి -కృష్ణమూర్తి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, కళింగ వైశ్య డైరెక్టర్ తూముల రమేష్, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## శివన్నపేటలో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ ఇఒ కె.సురేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ కార్మికులతో తొలగించారు. అనంతరం ప్రజలకు డ్రై డే పాటించడం ద్వారా కలిగే ఉపయోగాలు గూర్చి అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధికారక దోమల నిరోధించవచ్చని, అలాంటప్పుడు వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఉంటారని కావునా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తను అనవసరంగా వీధుల్లో వేయకుండా నిర్దేశిత స్థానాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కురుపాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురం ఐటిడిఎలో ఏర్పాటు చేసిన పిజిఆర్‌ఎస్‌కు వెళ్లి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం పరిసర మండలాలైన జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లోని పేద గిరిజన విద్యార్థుల డిగ్రీ చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని కురుపాంలో ఇప్పటికే బాలురు, బాలికల కోసం వసతి గృహాలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

## చెల్లంనాయుడువలసలో అన్నదానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చెల్లంనాయుడువలసలో కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ ధర్మకర్త డిజిఎస్‌వి త్రినాధ నాగరత్నం దంపతుల ఆధ్వర్యంలో పువ్వులపాధ్యమే పురస్కరించుకొని ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం చివర రోజు సందర్భంగా ఈ అన్నదాన నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

## సరాయివలసలో లోఓల్టేజి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని రాయిగుడ్డి వలస పంచాయితీ సరాయివలసలో లోఓల్టేజ్ సమస్య ఉండడంతో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్యను పరిష్కరించారు. పిఎం జుగా పథకం ద్వారా గ్రామంలో కొత్త సింగిల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రామంలో లోవోల్టేజ్ సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు విద్యుత్ శాఖ ఎఇ దాసరి సింహాచలం తెలిపారు. సకాలంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులను అభినందించారు

# గ్రీన్ అంబాసిడర్లంటే ఇంత నిర్లక్ష్యమా?

### హెల్త్ అలవెన్సుతో కలిపి కనీస వేతనం చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన హెల్త్ అలవెన్స్‌తో కలిపి వేతనం రూ.10 వేలు చెల్లించాలని, పంచాయతీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని, పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అంతవరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. మండలంలోని తంపటపల్లిలో గ్రీన్ అంబాసిడర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామీణ ప్రజలకు సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన హెల్త్ అలవెన్సులను నేటికీ చెల్లించకపోవడం దుర్మార్గమని, ఇప్పటికైనా హెల్త్ అలవెన్సులతో కూడిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు కాదా రాము, ఎస్.గురువులు, సూర్యనారాయణ, ఆర్.పకీర్, ఆనంద, రవి, సిఐటియు మండల నాయకులు మజ్జి వీరంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**పార్వతీపురం టౌన్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారానే పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ సభ్యులు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిని అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, మండల కన్వీనర్ బంటు దాసు మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డులకు పెండింగ్ జీతాలు చెల్లించి స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రక్షణ పరికరాలు, సేఫ్టీ జాకెట్లు, మాస్కులు, గ్లౌజులు, కొబ్బరి నూనె, సబ్బులు, బూట్లు, ఇవ్వాలి బళ్ళు రిపేర్లు, గుర్తింపు కార్డులు, యూనిఫాం, ఇన్సూరెన్స్ కల్పించాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్, సింహాచలం, బలరాం, రమేష్, పాండు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో గ్రీన్‌అంబాసిడర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

**కురుపాం :** గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి జియ్యమ్మవలస ఎంపిడిఒ ధర్మారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల నాయకులు బర్లంకి బలరాం, దొనక సురేష్, బెలగాం మహేష్, లావేటి బంగారి, బి.సత్యనారాయణ, బిడ్డిక సుమంత్, గిరిజన సంఘం నాయకుడు కోలంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

**కొమరాడ :** గ్రీన్ అంబాసిడర్లను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని ఆర్తాంలో విలేకరులతో మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని లేనిచో డిసెంబర్ 1నుంచి మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులు పాల్గొన్నారు.



పార్వతీపురం : ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

**సాలూరు :** మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో సమానంగా పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21000 చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ, గ్రీన్ అంబాసిడర్ వర్కర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒకు వినతిని అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఈశ్వరి, పంచాయతీ వర్కర్ల సంఘం నాయకులు సూరి, గిరి, సీతయ్య, అప్పారావు మాట్లాడారు. అరకొర జీతాలతో పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ అలవెన్స్‌లు రూ.4వేలతో కలిపి రూ.10వేలు పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని పంచాయతీ కమిషనర్ ఆదేశాలు జారీచేసిన ఎక్కడ అమలు చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీను, తవితయ్య, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి:** గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన హెల్త్ అలవెన్స్‌తో కలిపి వేతనం రూ.10 వేలు చెల్లించాలని, పంచాయతీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని, పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని అంతవరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ, పైడితల్లి, ఇఒపిఆర్‌డి గోపాలరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు వెంకటనాయుడు, అప్పడు, గౌరీశంకర్, పుచ్చల గోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



భూసార పరీక్షా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే

## రెవెన్యూ క్లినిక్ సేవలు భేష్ : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్టంలో ఎక్కడా లేనివిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ జిల్లాలో ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిస్తున్న సేవలు బేషుగ్గా ఉన్నాయని మంత్రి కొనియాడారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా సమావేశం ఇంచార్జి మంత్రి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్ సేవలను కొనియాడారు. రెవెన్యూ, భూపరిపాలనలో అపారమైన విశేష అనుభవం కలెక్టర్‌కు ఉందన్నారు. కలెక్టర్ చొరవతో దాదాపు రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయని, కొద్దిపాటి సమస్యలున్నాయని, అవికూడా త్వరగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ముస్తాబు కార్యక్రమం ద్వారా పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, పర్యాటక రంగానికి పెద్దపీట వేయడం పట్ల ప్రశంసించారు.

### భూసార పరీక్ష కేంద్రం ప్రారంభం

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన భూసార పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించడంతో పాటు మట్టి పరీక్ష ధ్రువపత్రాలను అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసులు లేని జిల్లాగా పార్వతీపురం

### జిల్లా, అధికార యంత్రాంగానికి ఎస్‌సి కమిషన్ చైర్మన్ అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

2025 జనవరి 1 నుంచి ఇప్పటి వరకూ ఒక్క అట్రాసిటీ కేసు కూడా నమోదు కాని జిల్లాగా పార్వతీపురం ఉండడం గర్వకారణమని రాష్ట్ర ఎస్.సి.కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ పేర్కొన్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, అధికారుల, ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియాను అభినందిస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీ కేసులపై జిల్లా అధికారులతో కమిషన్ చైర్మన్ సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రత్యేకంగా ఎస్సీ కమిషన్ పర్యటన చేసిందని అన్నారు. ఇక్కడ సమర్థులైన అధికారులు ఉన్నారని, ఒక్క అట్రాసిటీ కేసు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. వాస్తవాలను వెలుగులోకి తీసే సమయంలో మీ దృష్టికి ఏదైనా అట్రాసిటీ కేసు వస్తే, వాటిని తమకు తెలియజేయాలని, వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ రోజు పెదబొండపల్లి గ్రామాన్ని సందర్శించామని, దాదాపు 24 మంది దళిత రైతులకు సంబంధించిన భూమికి ఎటువంటి డాక్యుమెంట్లు లేనప్పటికీ యజమానులుగా చెప్పుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. జిల్లాలో సమగ్రంగా అన్ని శాఖలు ప్రతి లబ్ధిదారుడి ఎంపికలో దళితులకు సంబంధించిన 15 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. దళితులకు సంక్షేమం, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో 15 శాతం రిజర్వేషన్ పక్కాగా అమలు చేయమని ఆదేశించామన్నారు. ఇటీవల జీవో 19 వచ్చిందని, దీన్ని అనుసరించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ కూడా ప్రత్యేకంగా మరోసారి అధికారులతో మాట్లాడి అవసరమైన మార్గనిర్దేశకత్వాన్ని ఇస్తారని అన్నారు. అలాగే జిల్లాలో రైతాంగానికి సంబంధించి వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదలకు సంబంధించి, బోర్ వెల్స్‌కు సంబంధించి చిన్న సమస్యలు ఉన్నాయని, వాటిపై ఆయా అధికారులతో సమీక్షించి తక్షణమే పరిష్కరించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్మశాన భూమికి సంబంధించిన రిపోర్ట్‌ను తాను ఇక్కడ చూశానని, దాదాపుగా 97 శాతం దళితులకు ఇక్కడ శ్మశాన భూమి ఉందని, మిగిలిన 3 శాతం భూమిని సేకరించి శ్మశానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వసతి గృహాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోమని అధికారులను కోరినట్లు చెప్పారు. హాస్టల్ పిల్లలకు విద్య ద్వారా వివక్షత లేకుండా చేయడమనేది కమిషన్ ప్రథమ దృష్టిగా మేము తీసుకున్నట్లు తెలిపారు. వివక్షత లేని విద్యను అందించాలంటే పాఠశాల స్థాయిలోనే దాన్ని రూపుమాపాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి రాములు, కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు.

## నారన్నాయుడువలసలో పడకేసిన అపారిశుద్ధ్యం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారనాయుడువలసలో అపారిశుధ్యం పడకేసింది. ఈ గ్రామంలో పారిశుధ్యం, విద్యుత్తు, తాగునీరు రహదారులు సమస్య తీవ్రంగా ఉంది. ఈ గ్రామంలో ఎక్కడ చూసినా కాలువల్లో పూడికలు తీయకపోవడంతో ఎక్కడికక్కడ మరుగునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమలు పెరిగి దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ, ఫైలేరియా, పచ్చకామెర్లు తదితర వ్యాధులు బారినపడి పిల్లలు, వృద్ధుల ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలమైతే మరీ ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు చెబుతున్నారు. సర్పంచ్ స్థానికంగా లేకపోవడంతో గ్రామ సమస్యలపై దృష్టి సారించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని ప్రజలకు తగిన న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కాలువల్లో పేరుకుపోయిన చెత్త

## దగ్ధమైన చెరకు పంట పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలో గల చినకుదమలో సుమారు 35 ఎకరాల చెరకు పంట మంటల్లో దగ్ధమైన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం నష్టపోయిన పంట వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైపు నుంచి రైతులకు అన్ని రకాల సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్న నేపథ్యంలో త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి, పరిహారం అందేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు పల్ల రాంబాబు, కూటమి నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కాలిపోయిన చెరుకు పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

## రోడ్డు సమస్యపై మంత్రికి వినతి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కొదమ పంచాయతీ చింతమాల గ్రామానికి రోడ్డు సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ గిరిజనులు గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రిని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతమాల గ్రామ ప్రజలు లొద్ద వాటర్ ఫాల్ రహదారి నుంచి తమ గ్రామానికి సుమారు 2.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ గ్రామంలో 96 గిరిజన కుటుంబాల్లో 482 మంది నివసిస్తున్నారన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ గర్భిణీలు, విద్యార్థులు, వృద్ధులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, రహదారి నిర్మాణ ప్రతిపాదనను సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిశీలన జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే లొద్ద వాటర్ ఫాల్స్ పర్యాటక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రహదారి అభివృద్ధి చేస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగడమే కాక, గ్రామీణ జీవన ప్రమాణాలు కూడా మెరుగవుతాయని చెప్పారు.

# చెత్తను విభజిస్తే 'జీరో వేస్ట్' సాధ్యం : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పరిసరాలను, తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను మహిళలే ఎక్కువగా చూసుకుంటారని, ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ టి.టి. రత్నకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో వార్డు శానిటరీ సెక్రటరీలతో నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తప్పనిసరిగా తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తగా వేరు చేయాలని సూచించారు. తడి చెత్తను హోమ్ కంపోస్ట్‌గా మార్చడం ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువును టెర్రస్ గార్డెన్లు, మొక్కల పెంపకానికి ఉపయోగించుకోవచ్చని, దీనిపై ఆర్‌పిలకు ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. పొడి చెత్తను విభజించి, రీసైకిల్ ద్వారా అమ్మకాలు జరపడం వల్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న విషయాలను తమ పరిధిలోని మహిళల్లో అవగాహన కల్పించాలని ఆర్‌పిలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్లు గణపతమ్మ, నారాయణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

**పాచిపెంట:** క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ద్వారా క్లాప్ మిత్రులకు ఒకరోజు శిక్షణ ఇచ్చినట్టు ఎంపిడిఒ బివిజె పాత్రో తెలిపారు. మండలంలోని అందరు క్లాప్ మిత్రలను ఆరు బృందాలుగా విభజించి, ఒక్కొక్కటి టీం కొన్ని యాక్టివిటీస్ చేసేలా ఏర్పాటు చేశామన్నారు. వీరికి ప్రతిరోజు పద్ధతి ప్రకారం చేయాల్సిన పనుల గురించి శిక్షణ ఇచ్చామని తెలిపారు.. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు

**సీతానగరం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పచ్చదనం పరిశుభ్రతపై మూడు రోజులుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ క్రాప్ మిత్రలు ప్రతిరోజు చెత్త సేకరణ చేసి వేస్ట్ మేనేజ్మెంట్లో వేయాలన్నారు. అనంతరం చినబోగిలిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని గ్రీన్ క్రాప్ మిత్రులంతా చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు క్రాస్ మిత్రులు పాల్గొన్నారు..



పాచిపెంటలో శిక్షణకు హాజరై గ్రీన్ అంబాసిడర్లతో ఎంపిడిఒ పాత్రో

**వీరఘట్టం** గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చొరవ చూపాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ గ్రీన్ అంబాసిడర్ల, గ్రీన్ గార్డులను ఆదేశించారు. శుక్రవారం వీరఘట్టంలో గల చెత్త సంపద కేంద్రంలో ఏర్పాటు చేసిన పచ్చదనం పరిశుభ్రత ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఆదిశగా బాధ్యత వహించాలన్నారు. ప్రజలు కూడా పారిశుధ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, ఇఒ వై.గిరి, సచివాలయాల కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డుల పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఈతమానుగూడ, డెప్పిగూడ, కొత్తగూడ, కోసింగూడ, కాన్సింగ్ గూడ, తదితర గిరి శిఖర గ్రామాల్లో పిఎం జన్మన్ నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవనాలను శుక్రవారం ఐటిడిఎ ఎఇ అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.వేణుగోపాల్‌తో కలిసి ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించామన్నారు. అలాగే డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా జి.శివడ, రస్తాకుంటుబాయి గ్రామాల్లో సందర్శించి గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రీన్ అంబాసిడర్లకు, ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.ధనుంజయరావు, కిషోర్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సాలూరు

ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై నరసింహమూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్ నెంబర్లు, ఒటిపి వివరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పకూడదని, ఎటువంటి యాప్‌లు పడితే అవి ఇన్‌స్టాల్ చేయకుండా, ఫేక్ యాప్స్ విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, ప్రతి ఒక్కరూ ఈ జాగ్రత్తలను పాటించడం తప్పనిసరని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం జయమ్మ, సిసిలు, మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజారోగ్యం దృష్ట్యా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని కుమ్మరిగుంట, చినకేర్జిల, పెదఖేర్జిలలో శుక్రవారం సందర్శించి వైద్య సేవలు అందుతున్న తీరుపై పరిశీలించారు. సంచార చికిత్సా శిబిరాన్ని సందర్శించి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం ప్రతి నెలా ఏ మేరకు మెరుగుపడుతుందని, ఆరోగ్య పరీక్షల నివేదికలు తనిఖీ చేశారు. వారితో మాట్లాడి జీవన శైలి, ఆహార నియమావళి పై తెలుసుకొని తగు సూచనలు చేశారు. గిరిజన సంక్షేమ హాస్టల్ సందర్శించి అక్కడ పరిసరాలు, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించారు. సిక్ రూమ్‌లో విద్యార్థితో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. హెల్త్ వెల్నెస్ కేంద్రంలో రికార్డులు, మందుల లభ్యతపై తనిఖీ చేశారు. ఎన్సిడి,ఆర్బి.ఎస్.కె,లేప్రసీ, శాన్స్ సర్వేలపై ఆరా తీసి ఆన్లైన్ నమోదు పరిశీలించారు.డ్రైడే నిర్వహణ పై ఆరా తీశారు.

### కాగితాడలో వైద్య శిబిరం

**వీరఘట్టం :** మండలంలోని కంబర పంచాయతీ కాగితాడలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శు భారాతమని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, పాల్గొన్నారు.